క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పెండ్యాల(కంచికచర్ల) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లీగల్ ప్రొహిబిషన్ అధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్త పెండ్యాల కాలనీలో బాల్యవివాహాల నియంత్రణపై అంగనవాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహం చేసుకునే యువతులకు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండకపోతే భవిష్యత్‌లో ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాల సమాచారాన్ని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. బాలికలు పోషక విలువులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరీమా, రాణి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లకు స్లిప్‌ల పంపిణీ ప్రారంభం




జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని 222 పోలింగ్ కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్లు నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈనెల ఏడోతేదీ వరకు అన్ని గ్రామాల్లో బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేస్తారని తెలిపారు.

విద్యార్థిని కావ్యశ్రీకి సత్కారం



వత్సవాయి : పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 600మార్కులకుగాను 590 మార్కులు సాధించిన కంభంపాడుకు చెందిన కావ్యశ్రీని ఆర్యవైశ్య సంఘంనాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు విద్యార్థినికి వేదపండితులు ఆశీర్వచనాలతోపాటు శాలువా కప్పి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కావ్యశ్రీ భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆక్షాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి కొత్తపల్లి నరేష్, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షులు పోలా పూర్ణచంద్రరావు, సంఘ పెద్దలు గుర్రం కోటేశ్వరరావు, చిరునోముల రమేష్, గుర్రం హనుమంతురావు, యర్రా శ్రీనివాసరావు, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ



నందిగామ: నందిగామ పోలీసుస్టేషన్‌ను ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ ప్రీతెందర్‌సింగ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్‌తో కలిసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్న పోలీసు బందోబస్తు, తీసుకుంటున్న భద్రతా చర్యలపై సమీక్షించారు.

వైఎస్సార్ సీపీలోకి 32 కుటుంబాలు



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఏడోవార్డు నుంచి 18 కుటుంబాలవారు, చిల్లకల్లుకు చెందిన ఎనిమిది కుటుంబాలవారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్ సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గోపి, భార్గవి, బుజ్జి, నరసింహ, పాము రోశయ్య ఉన్నారు. జయంతిపురం గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీను, రుక్మిణి, నాగమ్మ, దుర్గా వైఎస్సార్ సీపీలో చేరారు. అదేవిధంగా కరిసె మధు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరగా, వీరందరికీ విప్‌ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు.

పేట బరిలో 13మంది అభ్యర్థులు

- చివరి రోజున ఓ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ..
- అభ్యర్థులను ప్రకటించిన ఆర్వో
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జగ్గయ్యపేట నియోజకవర్గంలో 13మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు ముగిసింది. ఆమోదించిన 14మంది అభ్యర్థుల నామినేషన్లలో స్వతంత్ర అభ్యర్థి జిల్లెపల్లి సుధీర్‌బాబు తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో చివరికి 13మంది ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఎన్నికల సంఘం గుర్తించిన పార్టీలకు చెందిన నలుగురు అభ్యర్థులు, గుర్తింపులేని పార్టీ తరపున ఓ అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థులు ఎనిమిది మంది ఉన్నారని ఆర్వో తెలిపారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు..

పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల గుర్తులు కేటాయించినట్లు ఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కర్నాటి అప్పారావు(హస్తం), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామినేని ఉదయభాను(ఫ్యాన్), టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్(సైకిలు), బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కొదమల ప్రభుదాస్(ఏనుగు), తెలుగురాజ్యాధికార సమితి అభ్యర్థి గుడిసె రాంబాబు(రబ్బర్‌స్టాంప్)ను ఎన్నికల గుర్తులుగా కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులు అయిలపోగు వెంకటేశ్వర్లు(రోడ్ రోలర్), కందుల నరసింహారావు(బకెట్), చేకూరి గోపినాథ్(పెన్‌స్టాండ్), జామ ఆనందరావు(ఎయిర్ కండీషనర్), జొన్నకూటి అహరోను(ఉంగరం), బేరోతుల ప్రకాశరావు(గాజుగ్లాస్), మేడేపల్లి ఫ్రాన్సిస్(బీరువా), వేల్పుల విజయకుమార్(ఆపిల్)గుర్తులు కేటాయించారు. గాజుగ్లాసు గుర్తుకోసం పలువురు స్వతంత్ర అభ్యర్థులు ఆసక్తిచూపగా, లాటరీ ద్వారా స్వతంత్ర అభ్యర్థి బేరోతుల ప్రకాశరావుకు గాజుగ్లాసు గుర్తు దక్కింది.



అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తున్న జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు



సామినేని ఉదయభాను



శ్రీరాం రాజగోపాల్

ఒక బ్యాలెట్ యూనిట్ చాలు



జగ్గయ్యపేట : సాధారణంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం) బ్యాలెట్ యూనిట్‌లో 16 గుర్తులకు బటన్లు ఉంటాయి. ఇందులో ఒకటి నోటాకి కేటాయిస్తారు. ఈ నోటా బటన్ యూనిట్‌కు చివరిలో ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో 15మందికి మించి అభ్యర్థులు నిలిస్తే రెండో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో 13మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో 15మంది అభ్యర్థుల కంటే తక్కువ మంది మాత్రమే ఎన్నికల బరిలో నిలిచినందున ఈ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల పోలింగ్ కోసం సింగిల్ బ్యాలెట్ యూనిట్ సరిపోతుందని ఎన్నికల అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో తాము ఓటెయ్యాలనుకున్న అభ్యర్థి గుర్తు ఎక్కడ ఉందోనని వెతులాడుకునేందుకు పోలింగ్ కేంద్రంలో అధిక సమయం వెచ్చించే పరిస్థితి ఓటర్లకు తప్పిందనే చెప్పవచ్చు.

నందిగామలో తొమ్మిది మంది అభ్యర్థులు

- 11 నామినేషన్లలో రెండు నామినేషన్లు ఉపసంహరణ
- తుదిజాబితాను ప్రకటించిన ఆర్వో రవీంద్రరావు
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

నందిగామ: సార్వత్రిక ఎన్నికల్లో నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. నందిగామలో మొత్తం 11మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించగా, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి బర్రె శ్రీనివాసరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతమాల శాస్త్రి తమ నామినేషన్లును ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన తొమ్మిది మంది అభ్యర్థుల తుదిజాబితాను ఆర్వో ప్రకటించారు. ఆయా అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. ఎన్నికల బరిలో నిలిచిన వారిలో వైఎస్ఆర్ సీపీ తరపున డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు(సీలింగ్ ఫ్యాన్), టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య(సైకిల్), కాంగ్రెస్ అభ్యర్థిగా మందా వజ్రయ్య(హస్తం), బీఎస్పీ అభ్యర్థిగా బర్రె ఉదయ్‌కిరణ్(ఏనుగు), సమాజ్‌వాదీపార్టీ నుంచి కటారపు శాంతారావు(బైస్కిల్ పంప్), జై మహాభారత్ పార్టీ నుంచి పణితీ లాల్(వేణువు), జై భీమ్‌రావ్ భారత్‌పార్టీ నుంచి బెజవాడ గోపి(కోటు) ఉన్నారు. వారికి ఎన్నికల గుర్తులు కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులు నిప్పులపల్లి కోటేశ్వరరావు(గన్నా కిసాన్), కొత్తపల్లి సుందరరావు(ఆపిల్) గుర్తు కేటాయించినట్లు ఆర్వో రవీంద్రరావు వివరించారు.



ఎన్నికల విధుల్లో నందిగామ ఆర్వో ఎ.రవీంద్రరావు, ఏఆర్వోలు



మొండితోక జగన్‌మోహన్‌రావు



తంగిరాల సౌమ్య



బర్రె ఉదయ్‌కిరణ్

జగనన్న మళ్లీ సీఎం కావాలి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల :పేదల బతుకులు మరింత బాగుండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. కంచికచర్ల అంబేడ్కర్ నగర్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి తాను చేసిన కృషిని తెలియజేసే బ్రోచర్‌ను పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని), నందిగామ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లకు కోరారు. ఈసందర్భంగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి మరింతగా జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పరితపిస్తున్న తనకు ప్రతిఒక్కరూ అండగా ఉండి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, సర్పంచి వేల్పుల సునీత, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెద బాబు, నాయకులు దేవరకొండ గురవయ్య, బోడపాటి బాబూరావు, రవికుమార్, బచ్చు వెంకటేశ్వరరావు, అమర్లపూడి యోహాన్, దాసరి రాము, బ్రర్రె శంకరరావు, మేకల బాబు, తంగిరాల సృజినీకుమార్, చట్టు రవీంద్ర, చట్టి రాజు, శేషం వాసుబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, నాగరాజు, బడేటి మల్లి, కామా కృష్ణ, ఎం.పాండు పాల్గొన్నారు.



కంచికచర్ల అంబేడ్కర్‌నగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు

చంద్రబాబు ప్రజల విశ్వాసం కోల్పోయారు...

వీరులపాడు: తన పాలనలో మంచిజరిగితేనే ఓటెయ్యాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కోరుతున్నారని...అదేవిధంగా గత టీడీపీ పాలన(2014–19)లో మేలు చేకూరితేనే ఓటెయ్యాలని కోరే దమ్ము ఆపార్టీ అధినేత చంద్రబాబు ఉందా? అని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రశ్నించారు. మండలంలోని నందలూరు, తాటిగుమ్మి, గోకరాజుపల్లి, వెల్లంకి, దాచవరం గ్రామాల్లో సోమవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన డాక్టర్ జగన్‌మోహనరావుకు ఆయా గ్రామాల మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ప్రతిఒక్కరిని ఆకట్టుకుంటోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో కన్నా మిన్నగా ఇస్తామన్నా కూడా చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. ప్రచారంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, కాపు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొమ్మిశెట్టి భాస్కరరావు, షహనాజ్ బేగం, సర్పంచ్‌లు పలకా మోహన్ రెడ్డి, హుసేన్‌బీ, గద్దె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, నాయకులు నువ్వుల విశ్వనాథం, ఏలూరు నాగేశ్వరరావు, సురేష్, నన్నెబోయిన తిరుమలరావు, రాఘవరెడ్డి, డోర్నాల రవికుమార్, వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏలూరు సుశీల, జూపూడి వెంకటరావమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాఓటు మీకేనంటూ డాక్టర్ జగన్‌మోహనరావుతో కరచాలనం చేస్తున్న విద్యార్థిని



నందలూరులో ఓటర్లకు నమస్కరిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు

• రూ 1.50లక్షల నగదు స్వాధీనం

నందిగామ: లింగాలపాడు వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి బైక్‌పై రూ.1.50 నగదు తీసుకొని లింగాలపాడు వస్తున్నాడు. సరైనపత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్‌చేసి ట్రెజరీకి పంపించినట్లు ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు.

మంచి ప్రభుత్వానికి అండగా నిలవండి

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం హామీలను అమలుచేయడంతోపాటు రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. అన్నివర్గాలకు మంచిచేస్తున్న తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని కోరారు. జగ్గయ్యపేట 22వవార్డులోని డంగుమిల్లు ప్రాంతం, శ్రీచెన్నకేశవస్వామి ఆలయం ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యను అడిగితెలుసుకున్నారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. చివరకు వలంటీర్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటిదగ్గరకు వెళ్లి పింఛన్లు అందించే ప్రక్రియను సైతం అడ్డుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ప్రజలకు మంచి చేసినందునే ఓటు వేయమని ధైర్యంగా అడుగుతున్నామని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే ఆయా పథకాలు సజావుగా అమలవుతాయని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఈ ఐదేళ్లో రూ.2400కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ ఐదేళ్లలో తాను చేసిన 20అభివృద్ధి పనులను వరుసగా చెబుతానని, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పగలరా? అని ప్రశ్నించారు. డీబీటీ రూపంలో నియోజకవర్గ ప్రజలకు రూ.1245కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమయ్యాయని గుర్తుచేశారు. స్థానికంగా డంగుమిల్లు ప్రాంతంలో స్మశానానికి వెళ్లే మార్గంలో చిన్నేటిపై ఉన్న ఇరుకు బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టినట్లు ఓటర్లకు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో జగ్గయ్యపేటను మరింత అభివృద్ధి చేస్తానని ఉదయభాను హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విప్ సామినేని ఉదయభాను, నాయకులు

ప్రమాదాల నివారణపై అవగాహన

నందిగామ: వేసవికాలంలో అగ్నిప్రమాదాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఫైర్ అధికారి డివిఎన్ పూర్ణచంద్రరావు సూచించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగినపుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



వెంకటగిరి గుట్ట ప్రాంతంలో ఓట్లు అభ్యర్థిస్తున్న సామినేని విమలాభాను



ముండ్లమూరులో ప్రచారం చేస్తున్న మాజీఎంపీపీ శ్రీనివాసరావు, వాసు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన సామినేని ఉదయభానును మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి సామినేని విమలాభాను కోరారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గెలుపు కోరుతూ వెంకటగిరిగుట్ట ప్రాంతంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఉదయభానుతోపాటు విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఉదయభాను సోదరీమణులు జయశ్రీ, చాముండేశ్వరి(బేబి), నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ మండలంలోని ముండ్లపాడులో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వత్సవాయి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కాంక్షిస్తూ జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం వత్సవాయిలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు మండల పార్టీ నాయకులు చిరుమామిళ్ల ప్రభాకరరావు, మండల సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, కొలుసు రాంబాబు, చింతల ఏడుకొండలు, రంగిశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నార.

చంద్రబాబువి మోసపూరిత మాటలు

చందర్లపాడు(నందిగామ): చంద్రబాబు మోసపూరిత మాటలను మాదిగలు నమ్మవద్దని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆంధ్ర, వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపిన నేపథ్యంలో చందర్లపాడు మండలంలోని వెలదికొత్తపాలెం, కొండపేట, కాసర బాద, పోపూరు, కొడవటికల్లు గ్రామాల ఎస్సీ కాలనీల్లో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాదిగలను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు. హక్కుల కోసం పోరాడితే రోడ్డుమీద కూడా తిరగనివ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు మాదిగలపై చంద్రబాబు కురిపిస్తున్నది కపటప్రేమ మాత్రమేనన్నారు. చంద్రబాబు మాటలు నమ్మేస్థితిలో మాదిగలు లేరన్నారు. ఈ ఎన్నికలలో నందిగామ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావును గెలిపించడంతోపాటు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా మాదిగలు అండగా నిలబడాలని కోరారు. ప్రచారంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్ర నాయకులు కనకపూడి వెంకటరత్నం, కోట సత్యానందం, వేమవరపు నూకయ్య, సంఘం రవి పాల్గొన్నారు.



కొడవటికల్లులో ప్రచారం నిర్వహిస్తున్న దొండపాటి సుధాకర్ మాదిగ, నాయకులు

వైఎస్సార్ సీపీకి జైభీమ్ శ్రీనివాస్ మద్దతు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మంచికోరే నిర్ణయాలు తీసుకుంటున్నారనేందుకు ఆయన ప్రకటించిన మేనిఫేస్టోనే నిదర్శనమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జైభీమ్ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ జైభీమ్ శ్రీనివాస్ వైఎస్సార్ సీపీకి మద్దతు పలికడం అభినందనీయమంటూ ఆయన్ను అభినందించారు. జైభీమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫేస్టోతో నిరుపేదలకు మంచి జరుగుతుందన్నారు. ముఖ్యంగా దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫేస్టోకు ఆకర్షితుడనై తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. నాయకులు బోడపాటి బాబురావు, పాకాలపాటి కిరణ్, మన్నం దాసు, పిల్లి జయరాజు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, పక్కన జైభీమ్ శ్రీనివాస్, నాయకులు

25 మంది వలంటీర్లు రాజీనామా

నందిగామ: నందిగామ పట్టణంతోపాటు మండలంలో మొత్తం 25 మంది వలంటీర్లు తమ విధులకు సోమవారం రాజీనామాచేశారు.పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 15 మంది వలంటీర్లు, తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ హేమమాలినికి అందజేశారు. మండలంలోని గోళ్ళమూడి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామాపత్రాలను ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌కు అందజేశారు .

నేడు ఓటర్లకు అవగాహన సదస్సు

నందిగామ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఓటర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నందిగామ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాంధీసెంటర్‌లో ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఓటర్లు హాజరుకావాలని కోరారు.

రేపు గురు విశ్వస్ఫూర్తి జన్మదిన వేడుకలు

పెనుగంచిప్రోలు: ఆధ్యాత్మిక గురువు విశ్వస్ఫూర్తి 84వ జన్మదిన వేడుకలను మే ఒకటోతేదీన పెనుగంచిప్రోలులోని స్ఫూర్తి యూనివర్స్‌లో నిర్వహించనున్నట్లు సోమవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటోతేదీ ఉదయం నాలుగు గంటల నుంచి పీఠపూజ, 108సార్లు మూలమంత్రోచ్చారణ, గురుపూజ, హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో ఉదయం 9.25గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు.